




అంగన్వాడీ యూనియన్ జిల్లా నూతన కమిటీ

మా బతుకులు తెల్లబడేదెప్పుడో?

- పేరుకే రజక కార్పొరేషన్
- చెడిపోయిన బోర్లు
- నిరుపయోగంగా దోబీఘాట్లు
- ఇబ్బందుల్లో రజకులు
- పట్టని ప్రభుత్వం

ప్రజాశక్తి- రాయచోటి

పలువురు ధరించే దుస్తులను తెల్లగా ఉతికి, ఇస్త్రీ చేసి వారిని పది మందిలో హుందాగా కన్పించేలా చేసేవారు రజకులు. అలాంటి వారి జీవితాలు ఎన్ని ఏళ్లు గడుస్తున్నా మాత్రం మారడం లేదు. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా దాదాపు 30 వేలకుపైగా రజకులున్నారు. సుమారు దాదాపు 12 వేలు మంది రజక వృత్తిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం చెరువులు, వాగులు, వంకల్లో నీరు లేకపోవడంతో బట్టలు ఉతకడానికి రజకులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో రజకులకు దోబీఘాటు ఏర్పాటు చేసి వారికి ఆదరణ పథకం కింద ఇస్త్రీ పెట్టెలు, ఇనుప అండాలు, తోపుడు బండ్లు అందజేసేవారు. దోబీ ఘాట్ల వద్ద బోరు, మోటారు ఏర్పాటు చేసి మంచి నీటితో దుస్తులు ఉతుక్కొని అక్కడే ఆరబెట్టుకునేందుకు స్థలం కూడా కేటాయించారు. ప్రస్తుతం వర్షాలు కురవకపోవడంతో బోర్లు ఎండిపోయి, ఉన్న మోటర్లు చెడిపోవడం వల్ల నీరు లేక దోబీ ఘాట్లన్నీ ముళ్లపొదలతో నిండికున్నాయి. మరి కొన్ని ప్రాంతాలలో ఆక్రమణలకు గురయ్యాయి. చెడిపోయిన మోటార్లు తయారు చేసేందుకు గ్రామ పంచాయతీల వద్ద నిధులు లేకపోవడంతో తాము ఏమీ చేయలేమంటూ చేతులెత్తేశారు. దోబీఘాట్లు నేడు నిరుపయోగంగా మారిపోయాయి. చెడిపోయిన బోర్లు, మోటార్లను తయారు చేయించాలంటూ సర్పంచ్‌లను కోరగా వారు ప్రభుత్వమే పంచాయతీలో ఉన్న డబ్బులు అన్ని లాక్కున్నారని తమ వద్ద ఎలాంటి నిధులు లేవని చెబుతున్నారు. కనీసం వీధిలైట్లు పోయినా, పారిశుధ్య పనులు చేపట్టాలన్నా నిధులు లేవని సర్పంచ్ చెబుతున్నట్లు రజకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో నాయకులు వచ్చి తమ పార్టీకి ఓట్లు వేసి గెలిపిస్తే గృహాలు, ఇంటి స్థలాలు, దోబీఘాట్లు మంజూరు చేయిస్తామని చెప్పి ఎన్నికల తర్వాత పట్టించుకున్న పాపాన పోలేదని పేర్కొంటున్నారు. దస్తులు ఉతకడానికి నీటి సదుపాయం లేక పోవడంతో 2, 3 కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. అక్కడికి వెళ్లేందుకు గతంలో గాడిదలు ఉండేవని, వాటిపై మూటలు వేసుకొని వెళ్లి ఉతికి ఆరబెట్టుకుని తిరిగి ఎవరి దుస్తులు వారికి ఇచ్చేవాళ్లం అంటున్నారు. ప్రస్తుతం గాడిదలు లేవు, తాము మోయలేక అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. కొన్ని చోట్ల నీళ్లు ఉన్నప్పటికీ ఆ నీటిలో గంటల తరబడి దుస్తులు ఉతకడం వల్ల కాళ్లు పేలిపోవడం చేతులు తెల్లబడిపోయి వంకరలు కావడం, కీళ్ల జబ్బులు వస్తున్నాయని పేర్కొన్నారు. గతంలో అనారోగ్యం గురైతే ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం చేసేవారని, ఇప్పుడు కార్పొరేట్ ఆసుపత్రిలో తెల్లరేషన్ కార్డు చూపినా ఉచిత వైద్య సేవలు కూడా అందడం లేదన్నా తెలిపారు. చాలామంది కాళ్లు వంకర్లు పోవడం, చేతులు పేలిపోవడం, నడుములు, భుజాల నొప్పులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంటున్నారు. ఇస్త్రీ చేయాలన్న బొగ్గులు దొరకడం లేదని చెబుతున్నారు. బొగ్గుల మూటలు కొని వాటి చేత ఇస్త్రీ చేయాలంటే ఆర్థిక భారం అధికమైందని పేర్కొన్నారు. ప్యాంట్, సర్ట్ ఇస్త్రీ చేస్తే కేవలం రూ.10 మాత్రమే ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ జీవితాలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన మారిందని వాపోతున్నారు. ప్రభుత్వం రజకుల కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేసినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేదని వాపోయారు. బ్యాంకుల ద్వారా రజకులకు రుణాలు మంజూరు చేసి ఇస్త్రీ పెట్టెలు, తోపుడు బండ్లు, గంగాళాలు వంటి వాటిని సబ్సిడీతో అందించాలని, రజకులకు రాజకీయ, సామాజిక అన్ని రంగాలలో ప్రాధాన్యత కల్పించి, కార్డులు ఇతర పరికరాలు సరఫరా చేయాలని జిల్లా లోని పలువురు రజకలు కోరుతున్నారు.



చెడిపోయిన బోరు



నీరు లేక నిరుపయోగంగా ఉన్న దోబీఘాట్

రజక వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నాం

రజక వృత్తిపైనే 20 కుటుంబాలు జీవనోపాధి కోసం ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. దోబీఘాట్ల ఆక్రమణల కారణంగా ఈ స్థలాలు రోజు రోజుకూ కనుమరుగవుతున్నాయి. దుస్తులు ఉతికినా, ఆరబెట్టిడానికి కూడా స్థలం దొరకడం కష్టమవుతోంది. ఈ దోబీఘాట్‌లు కోల్పోతే మా జీవనాధారం కోల్పో తున్నామనే భయం బాధిస్తోంది. గతంలో మాది రిగా దుస్తులు కూడా ఎక్కువగా రావడం లేదు. మా వృత్తి, మా ఆత్మగౌరవం, మా జీవనాధారం కోసం ఈ దోభిఘాట్‌లను రక్షించాలి.



- వి.అంజనమ్మ, బేతల కాలనీ, రాయచోటి.

రజకులను ఆదుకోవాలి

దోబీఘాట్లు శతాబ్దాలుగా సమాజానికి సేవలు అందిస్తున్న ప్రదేశాలు ఇవి కేవలం పని స్థలాలు మాత్రమే కాదు, అనేక కుటుంబాలకు జీవనాధారం. దోబీఘాట్లను సర్వే చేసి, సరిహద్దులు నిర్ధారించి, అవసరమైన సౌకర్యాలు కల్పించాలి. భవిష్యత్తులో ఆక్రమణకు గురి కాకుండా ఉండేందుకు కఠినమైన చట్టాలు, శిక్షలు అమలు చేయాలి. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగా 50 ఏళ్లు నిండిన రజకులకు పింఛను ఇవ్వాలి. కులవృత్తులకు సంబంధించిన పని ముట్లు ఉచితంగా ప్రభుత్వం ఇచ్చి రజకులను ఆదుకోవాలి.



- టి.రమేష్‌బాబు, రజక సంఘం జిల్లా అధ్యక్షులు, రాయచోటి.

'అంగన్వాడీ' యూనియన్
అధ్యక్ష, కార్యదర్శులుగా శ్రీలక్ష్మి, రాజేశ్వరి

- 33 మందితో జిల్లా నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

ఆంధ్రప్రదేశ్ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అన్నమయ్య జిల్లా కమిటీ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా తిరిగి ఎస్.శ్రీలక్ష్మి, పి.రాజేశ్వరి ఎన్నికయ్యారు. కోశాధికారిగా ఎం.గౌరి ఎన్నికయ్యారు. మదనపల్లెలో జరుగుతున్న సంఘ రెండవ జిల్లా మహాసభ శనివారం నూతన కమిటీని ఎన్నుకుంది. 13 మంది ఆఫీస్ బేరర్లు, 33 మంది తో జిల్లా కమిటీ ఏర్పడింది. కమిటీని మహాసభ ఏకగ్రీవంగా అమోదించింది. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా ఎస్.శ్రీలక్ష్మి, పి.రాజేశ్వరి, కోశాధికారిగా ఎం.గౌరి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎస్.ఓబుళమ్మ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా డి.భాగ్యలక్ష్మి, ఉపాధ్యక్షులుగా శ్రీవాణి, ఈశ్వరమ్మ, యల్లమ్మ, సంపూర్ణ, సహాయ కార్యదర్శులుగా గంగాదేవి, భూకైలేశ్వరి, ప్రమీల, వసంత ఎన్నికయ్యారు. ఈ మహాసభలకు పరిశీలకులుగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ, కోశాధికారి లక్ష్మిదేవి పాల్గొన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాం జులు, జిల్లా ఉపాధ్యక్షులు పి.శ్రీని వాసులు, సిఐటియు జిల్లా కోశాధికారి టి.హరిశర్మ, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎం.భాగ్యమ్మ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి అంగన్వాడీలు పాల్గొన్నారు.

భక్త కనకదాస చూపిన బాటలో నడుద్దాం

ప్రజాశక్తి - రాయచోటి

భక్త కనకదాస చూపిన బాటలో నడుద్దామని కురబ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల వెంకటరమణ, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి నాగేంద్ర రాజు పేర్కొన్నారు. శనివారం భక్త కనకదాస జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో కురబ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల వెంకటరమణ, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి నాగేంద్రరాజు వివిధ శాఖల జిల్లా అధికారులు భక్త కనకదాస చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కురబ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మాట్లాడుతూ భక్త కనకదాస, తన రచనల ద్వారా సమ సమాజ నిర్మాణానికి దోహదం చేశారన్నారు. ఆయన చూపిన బాటలో మనమందరం నడవాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి మాట్లాడుతూ కర్ణాటక ప్రాంతానికి చెందిన భక్త కనకదాస, సామాన్యులకు అర్థమయ్యే విధంగా కన్నడ భాషలో రచనలు, కీర్తనలు రాసి కృష్ణుడి భక్తుడయ్యారన్నారు. ఆయన తన రచనల ద్వారా సమ సమాజ నిర్మాణానికి దోహదం చేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి నాగేంద్రరాజు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి దామోదర్ రెడ్డి, బిసి వసతి గృహ సంక్షేమ అధికారుల సంఘం అధ్యక్షులు మనోహర్ రెడ్డి, కురుబ సంఘ నాయకులు రఘునాథ్, జబ్బల శ్రీనివాస్, ఈశ్వరయ్య, అడ్వకేట్ రవి శంకర్, రమణ పాల్గొన్నారు. **రాయచోటి అర్బన్ :** తాత్వికవేత్త, సంగీత కారుడు, హరికథా పితామహులైన భక్త కనకదాస జీవితం అందరికీ ఆదర్శనీయమని రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు జబ్బల శ్రీనివాసులు, నాగేశ్వ రరావు అన్నారు. కురువ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో భక్త కనకదాస జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్త కనుకదాసు జీవితం అందరికీ ఆదర్శ ప్రాయమన్నారు. కార్యక్రమంలో జిల్లా కురువ సంఘం అధ్యక్షుడు తరిగొండ ఈశ్వరయ్య, అడ్వకేట్ రవిశంకర్, సంఘ నేతలు సుధాకర్, మురళి కుమార్ రెడ్డన్న ,నాగేంద్ర, రమణయ్య, రవి, చంద్రమోహన్ పాల్గొన్నారు.



వైద్య కళాశాలల ప్రయివేటీకరణ వ్యతిరేక ర్యాలీ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

పేద విద్యార్థులకు అన్యాయం

- పోస్టర్ల విడుదలలో వైసిపి నాయకులు

ప్రజాశక్తి- రాయచోటి అర్బన్

పిపిపి విధానంతో మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరణ చేయాలనే కూటమి ప్రభుత్వం నిర్ణయం వల్ల వైద్యవిద్యను అభ్యసించాలనే పేద విద్యార్థులకు తీరని అన్యాయం జరుగుతుందని వైసిపి నాయకులు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ప్రయివేటీకరణ వ్యతిరేకంగా ర్యాలీకి సంబంధించిన పోస్టర్లను విదుల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద, మధ్యతరగతి విద్యార్థులకు వైద్య విద్య, ప్రజలకు వైద్యం ఉచిత వైద్యం అందించేందుకు వైసిపి హయాంలో రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలను స్థాపించారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కళాశాలలను ప్రయివేటీకరణ చేయాలని నిర్ణయం తీసుకొని పేద ప్రజలు, విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక వైఖరికి నిరసనగా ఈ నెల 12న అన్ని రెవెన్యూ డివిజన్లలో ర్యాలీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని వైసిపి నాయకులు రెవెన్యూ డివిజన్ల పరిధిలో జరిగే ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొలిమి హారూన్ బాష, మున్సిపల్ విభాగం జిల్లా అధ్యక్షుడు రియాజ్, రెహమాన్, జిల్లా సోషల్ మీడియా అధ్యక్షులు నరేష్ స్వామి, రాయచోటి మేధావుల సంఘం అధ్యక్షులు జానం రవీంద్ర యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, వైసిపి రాష్ట్ర యూత్ విభాగం కార్యదర్శి కాలాడి విజయ్, వినయ్ కుమార్‌రెడ్డి, జిల్లా మున్సిపల్ వింగ్ సెక్రటరీ హాబీబుల్లాఖాన్, రాయచోటి వింగ్ సెక్రెటరీ ఈశ్వర్‌ప్రసాద్, వైసిపి నాయకులు శ్యామ్‌కుమార్, సంతోష్‌కుమార్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, నవాజ్ క్రిష్, హజరత్ ఖాదర్ వలీ, సమయుల్లా పాల్గొన్నారు.

'మండిపల్లి'ని విమర్శించే అర్హత 'గడికోట'కు లేదు

ప్రజాశక్తి - రాయచోటి

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని విమర్శించే అర్హత మాజీ శాసనసభ్యులు శ్రీకాంత్‌రెడ్డికి లేదని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా పేర్కొన్నారు. శనివారం మంత్రి క్యాంపు కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాంత్‌రెడ్డి మాటలు దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉన్నాయని పేర్కొన్నారు. నాలుగు పర్యా యాలు మైనార్టీల ఓట్లతో గెలిచి వారిని మభ్యపెట్టి, ఎలాంటి అభివృద్ధి కార్యక్ర మాలు చేపట్టలేదని పేర్కొ న్నారు. వారి ఇళ్లకు వెళ్లి శాలువలు కప్పుకొని మాయ మాటలు చెప్పి కనీసం రాయచోటి మైనార్టీలకు కానీ, ప్రజలకు కానీ ఒక ఇటుక పేర్చినంత సహాయం కూడా చేయలేదని వాపోయారు. మంత్రిపై సవాల్ విసరడం ఆయన అవివేకానికి నిదర్శనం అని తెలిపారు. దమ్ముంటే ధైర్యం ఉంటే ప్రజా వేదిక వద్దకు వస్తే శ్రీకాంత్‌రెడ్డి చెప్పిన మాటకు ప్రజలే సమాధానం చెప్తారని పేర్కొన్నారు. రాయచోటి పట్టణలో షాదిఖానా కోసం కోట్ల రూపాయల స్థలం కేటాయించి షాదీఖానా నిర్మించిందని ఒక తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే అన్నారు. రాయచోటిలో 80 మసీదులలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ఇమామ్‌లకు, మౌజ్‌లకు వేతనాలు ఇచ్చిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు రోఫా సాంబశివరెడ్డి, నాగార్జునరెడ్డి, బసిరెడ్డి, కొండారెడ్డి, రెహమాన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గాజుల ఖాదర్‌బాషా



ప్రజల నుంచి విన్నపాలు స్వీకరిస్తున్న పీలేరు ఎమ్మెల్యే కిషోర్ కుమార్‌రెడ్డి

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి- పీలేరు

పీలేరు నియోజకవర్గంలో ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం ఎమ్మెల్యే నగిరిపల్లిలోని తన కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ నలుమూలల నుంచి ప్రజలు భూ తగరాదులు, విద్యుత్, తాగునీటి, ఆలయ నిర్మాణ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాలు సమర్పించారు. ఎమ్మెల్యే ప్రజలు, రైతుల సమస్యలను తెలుసుకుని సానుకూలంగా స్పందిస్తూ వారి విన్నపాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆయా మండల, గ్రామ అధికారులతో ఫోన్‌ల్లో మాట్లాడి ప్రజా సమస్యలకు పరిష్కార మార్గం చూపించాలని సూచించారు.

ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలి


ప్రజాశక్తి-పీలేరు

పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం చాలా అవసరమని ప్రధానోపాధ్యాయులు చంద్ర తెలిపారు. వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఎఫ్ఆర్ఒ జయప్రసాదరావు ఆదేశాల మేరకు శనివారం కె.వి.పల్లె మండలంలోని నూతనకాలువ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ కాలుష్యం కారణంగా అతివృష్టి, అనావృష్టి సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రమాదం ఉందన్నారు. ఇలాంటి పరిస్థితులు ప్రజల జీవన విధా నాలపై ప్రతికూల ప్రభావాలు చూపుతున్నాయని చెప్పారు. పర్యావరణ పరిరక్షణ పట్ల విద్యార్థుల్లో అవగాహన పెంచుతూ మొక్కల నాటే, పెంచే కార్యక్రమాలను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పీలేరు అటవీ శాఖ బీటు అధికారులు జగదీష్, రెడ్డి ఆసియా బి, చంద్రకళ, శ్రీనివాసన్, బేస్ క్యాంప్ వాచర్లు పాల్గొన్నారు.

డిసిఇబి కార్యదర్శి గంగాధర్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి-పీలేరు

జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు (డిసిఇబి) కార్యదర్శిగా ఇటీవల నియమితులైన తాటిపర్తి గంగాధర్‌ను ఘనంగా సన్మానించారు. శనివారం పీలేరు ఎంఆర్‌సి కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మదనపల్లి ఇన్‌ఛార్జి డివైడిఇఒ వై.లోకేశ్వర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయిలో పీలేరు మండలానికి డిసిఇబి కార్యదర్శి పదవి రావడం గర్వకారణమని, అనుభవజ్ఞుడు, క్రమశిక్షణ, విద్యావేత్త తాటిపర్తి గంగాధరం తన సమర్థవంతమైన నాయకత్వంలో డిసిఇబి మరింత ఉన్నత స్థాయికి చేరుతుందనే నమ్మకం తనకుందని పేర్కొన్నారు. మండల పరిధిలోని పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గంగాధరంను పూలమాల, శాలువతో ఘనంగా సన్మానించారు. గంగాధరం మాట్లాడుతూ డిసిఇబి కార్యదర్శిగా బాధ్యతలు అప్పగిం చడం నాకు గౌరవంగా ఉందని, ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, పీలేరు మండలానికి మంచి పేరు తీసుకురావడమే తన ముందున్న కర్తవ్యమని, విద్యారంగ అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శోభారాణి, రెడ్డప్ప, సురేంద్రనాథ్, నాగరత్నమ్మ, కిరణ్మయి, జైపాల్‌రెడ్డి, రేణుక తదితరులతో పాటు సిఆర్‌పిలు మురళీధర్ రాజు, అశోక్, శ్వేత తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



డిసిఇబి కార్యదర్శిగా ఎంపికైన గంగాధరంను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

మమ్దానీ పోరాటపటిమ స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి -వాల్మీకిపురం

ప్రపంచ ప్రసిద్ధ మహానగరం న్యూయార్క్ కార్పొరేషన్ ఎన్నికల్లో భారత సంతతికి చెందిన జోహ్రాన్ మమ్దానీ విజయం సాధించడం భారతీయులకు గర్వకారణమని రాష్ట్ర ఉర్దూ అకాడమీ మాజీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్, మాజీ సర్పంచ్ సురేష్ కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం వాల్మీకిపురంలో పార్టీలు, కులమతాలకు అతీతంగా జోహ్రాన్ మమ్దానీ విజయోత్సవ సంబరాలు నిర్వహించి, మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థకు కేంద్రంగా చెప్పుకునే న్యూయార్క్ మహానగర మేయర్ ఎన్నికల్లో డెమోక్రటిక్ సోషలిస్ట్‌గా చెప్పుకునే సామాజిక కార్యకర్త జొహ్రాన్ మమ్దానీ సంచలన విజయం సాధించి చరిత్రను సృష్టించారన్నారు. జోహ్రాన్ మమ్దానీ గెలుపు రాజకీయాల్లో సరికొత్త నాయకత్వ శకానికి మార్గం చూపిందని, అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇజ్రాయిల్ దేశంలోని శక్తివంతమైన నేతలు న్యూయార్క్ మేయర్ ఎన్నికల్లో జోహ్రాన్ మమ్దానీని ఓడించేందుకు సర్వశక్తులు ఒడ్డినా, న్యూయార్క్ ప్రజలు జోహ్రాన్ మమ్దానీ వెంట నిలిచి ప్రజాస్వామ్యానికి సరికొత్త నిర్వచనం చెప్పారన్నారు. జోహ్రాన్ మమ్దానీ తల్లి మీరా నాయర్ ప్రపంచంలోనే ప్రసిద్ధ సినీ దర్శకురాలిగా పేరొందారని, పరాయి దేశాల్లో స్థానం కోసం పెనుగులాడే వలస జీవుల కథలు, మానవ పరిణామ క్రమం, వివిధ సంస్కృతులను ఇనుమడింపజేసే అంశాలతో కూడిన సినిమాలకు మీరా నాయర్ దర్శకత్వం వహించి గతంలో ఆస్కార్ అవార్డుకు కూడా నామినేట్ అయ్యారని పేర్కొన్నారు. తల్లి ఆలోచన విధానాలతో ప్రభావితుడైన జోహ్రాన్ మమ్దానీ న్యూయార్క్ మేయర్‌గా విజయం సాధించి ప్రపంచ దృష్టిని ఆకట్టుకున్నారన్నారు. న్యూయార్క్ ఎన్నికల్లో ఆయన భారత తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ ఆశయాలను ప్రచారం చేసి అక్కడి ప్రజల మనసులను దోచుకున్నారని, యువత జోహ్రాన్ మమ్దానీని ఆదర్శంగా తీసుకొని రాజకీయ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ విశ్వనాద్‌రెడ్డి, వైసిపి నాయకులు రెడ్డెప్పరెడ్డి, రవి, రాయుడు, కేశవరెడ్డి, చిన్నరెడ్డపరెడ్డి, సుధాకర్, విశ్వనాధ్, శ్రీకాంత్, శేఖర్ నాయుడు, మైనారిటీ నాయకులు ఖాదర్ బాషా, అమిన్ పీర్, సమీ, జాకీర్, జబివుల్లా, ఇంతియాజ్, బషీర్, రహీం పాల్గొన్నారు.



మేయర్‌గా మమ్దానీ ఎన్నికపై సంబరాలు చేసుకుంటున్న నాయకులు

ఉద్యమాల ఫలితంగానే జిల్లా సాకారం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

నాటి ఉద్యమాల ఫలితంగానే మదనపల్లి జిల్లా సాకారమైందని ఎపిఎస్ఆర్‌టిసి 1, 2 డిపోల ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు నాగూర్ వలి స్పష్టం చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం జిల్లాల పునర్విభజన సమయంలో మదనపల్లి జిల్లా ఏర్పాటు చేయకుండా ఇక్కడ ప్రజలకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. జిల్లాల పునర్విభజన కాకమునుపే మదనపల్లి జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేశామన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకత్వంలో తాము జిల్లా సాధనలో భాగస్వాములు కావడం జరిగిందన్నారు. అప్పటి వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వం జిల్లా సాధన సమితి నాయకులతో పాటు తమపై అక్రమ కేసులు బనాయించగా, తనపై ఏడు కేసులు నమోదయ్యాయన్నారు. అయినప్పటికీ తాము వెనక్కి తగ్గకుండా పోరాటాలు చేశామన్నారు. యువగళం పాదయాత్రలో మంత్రి నారా లోకేష్, ఎన్నికల ప్రచారంలో సీఎం చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన వెంటనే మదనపల్లి జిల్లా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం త్వరలోనే సిఎం చంద్రబాబు నాయుడు మదనపల్లె జిల్లాపై అధికారిక ప్రకటన చేయనున్నారని,దీంతో దశాబ్దాల ప్రజల ఆకాంక్ష నెరవేరనున్నదని వెల్లడించారు. మదనపల్లి జిల్లా ఏర్పాటైతే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని, వ్యాపార రంగం అభివృద్ధి సాధిస్తుందన్నారు. సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే షాజహాన్‌బాషాలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

పోటాపోటీగా ఎస్‌వీయూ క్రీడా పోటీలు

ప్రజాశక్తి-మదనపల్లె

ఎస్‌వి యూనివర్సిటీ ఆధ్వర్యంలో మదనపల్లి పట్టణంలోని శ్రీజ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో అంతర్ యూనివర్సిటీ క్రీడా పోటీలు పోటాపోటీగా జరిగాయని కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ రాటకొండ గురుప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల క్రీడాస్ఫూర్తిని ప్రోత్సహించే లక్ష్యంతో ఈ పోటీలను నిర్వహించామని తెలిపారు. ఎస్‌వి యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ శివశంకర్‌రెడ్డి పర్యవేక్షణలో జరిగిన ఈ పోటీల్లో వివిధ కళాశాలల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు.చెస్ విభాగంలో, ఎస్‌జిఎస్ ఆర్ట్స్ కళాశాల విద్యార్థి ఎన్.ఎస్.బాలాజీ విజేతగా నిలవగా, ఎస్‌వి ఆర్ట్స్ కళాశాల విద్యార్థి ఓంకార్ రన్నరప్‌గా నిలిచాడు. షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో, సింగిల్స్ విభాగంలో ఎస్వీయూ ఇంజినీరింగ్ కళాశాల జట్టు విజేతగా, శ్రీనివాస డిగ్రీ కళాశాల జట్టు రన్నరప్‌గా నిలిచింది. డబుల్స్ విభాగంలో ఎస్వీయూ ఇంజినీరింగ్ కళాశాల జట్టు విన్నర్స్‌గా, ఎస్‌జిఎస్ ఆర్ట్స్ కళాశాల జట్టు రన్నరప్‌గా నిలిచింది. టెన్నిస్ పోటీల్లో, సింగిల్స్ విభాగంలో సీకాం డిగ్రీ కళాశాల జట్టు విజేతగా, ఎస్వీ యూనివర్సిటీ కళాశాల జట్టు రన్నరప్‌గా నిలిచింది. డబుల్స్ విభాగంలో శ్రీకాంత్ డిగ్రీ కళాశాల జట్టు విజేతగా, శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల జట్టు రన్నరప్‌గా నిలిచింది. టేబుల్ టెన్నిస్ విభాగంలో, సింగిల్స్ పోటీల్లో శ్రీకాంత్ కళాశాల జట్టు విజేతగా, ఎస్వీ యూనివర్సిటీ కళాశాల జట్టు రన్నరప్‌గా నిలిచింది.డబుల్స్ విభాగంలో కూడా శ్రీకాంత్ కళాశాల జట్టు విజేతగా, ఎస్వీ యూనివర్సిటీ కళాశాల జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఈ పోటీలను కళాశాల స్పోర్ట్స్ బోర్డు సభ్యుడు జి.పి.రాజు, పీడీలు శరత్ నాయక్, జగదీష్ పర్యవేక్షించారు. విజేతలైన విద్యార్థులను కరస్పాండెంట్ గురు ప్రసాద్, ప్రిన్సిపల్ రమాదేవి అభినందించారు. ఎస్‌జిఎస్ ఆర్ట్స్ కళాశాల రమేష్ రన్నర్‌గా నిలిచారని తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు అర్షియా ఎంపిక

ప్రజాశక్తి-రాజంపేట

కొత్తబోయినపల్లె పిఎంశ్రీ ఎస్‌జెఎస్‌ఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థిని అర్షియా ఉమ్మడి కడప జిల్లా తరపున రాష్ట్ర స్థాయిలో జరుగు అండర్-14 కబడ్డీ, అండర్-14 ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు భారతి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినీని ప్రధానోపాధ్యాయురాలితోపాటు ఉపాధ్యాయ బృందం అభినందించారు.



అర్షియాను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయులు భారతి


రెడ్డిశేఖర్‌ను సన్మానిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

కంచన రెడ్డిశేఖర్‌కు సన్మానం

ప్రజాశక్తి-సుండుపల్లె

కువైట్‌లోని అబసియా సెంట్రల్ స్కూల్‌లో నిర్వహించిన వనభోజన కార్యక్రమంలో గల్ఫ్ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారని సుగవాసి యువసేన, ఎన్ఆర్ఐ టిడిపి నాయకుడు కంచన రెడ్డిశేఖర్ పేర్కొన్నారు. గల్ఫ్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కోడి నారాయణ, ఉపాధ్యక్షుడు ఆదినారాయణ కమిటీ సభ్యులు ఆహ్వానం మేరకు వనభోజనం కార్యక్రమంలో పాల్గొన్నామని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయని పేర్కొన్నారు.వనభోజనం సందర్భంగా అతిథులకు సన్మానం, ఆతిథ్యం ఆకట్టుకున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ముద్దం వెంకటపతి, పరమేష్, డాన్స్ మాస్టర్ వేణు, కుమార్ రాయల్, టిడిపి పాలఏకిరి అధ్యక్షుడు శ్రీహరి నాయుడు, టిడిపి నాయకులు వెంకట్ బుజ్జి, పరిటాల ట్రస్ట్ అధ్యక్షులు నరసింహ, ప్రముఖులు హాజరయ్యారు.

నేటి నుంచి శ్రీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మండలంలోని కుర్నూతల గ్రామ పంచాయతీ లో శ్రీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం గణపతి పూజతో మొదలై ధ్వజా రోహణం, అగ్ని ప్రతిష్టపూజ,అలంకరణ, ఉత్సవ విగ్రహాల అలంకరణ, 10న పూజ నవగ్రహ ఆరాధన, పూజ వేద పారాయణం, మహా మంగళ హారతి, తీర్థప్రసాదాలు, 11న లక్ష్మీనారాయణ సుదర్శన నవగ్రహ హోమం, పుష్ప యాగం ఊంజలసేవ జరుగుతుందన్నారు. 12న పురుష సూక్తిమూలమంత్ర, నవగ్రహ శ్రీమ హా విష్ణువు సహస్రనామ, చివరి రోజు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ చెన్నకేశవ స్వామివారి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించ బడునని పేర్కొన్నారు.


పాడి రైతులకు పశు దాణా అందిస్తున్న పశు వైద్యులు

పాడి రైతులకు దాణా పంపిణీ

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

స్థానిక పశు ఆసుపత్రిలో శనివారం ప్రభుత్వం పాడి రైతులకు 50 శాతం సబ్సిడీతో పశువుల దాణాను పంపిణీ చేసినట్లు పశు వైద్యశాఖ ఎడి సుమిత్ర అన్నారు. స్థానిక పశు వైద్యశాలలో పశు వైద్యాధికారి విక్రమ్‌రెడ్డి సిబ్బంది కిరణ్, కలిసి పశువుల దాణా పంపిణీని చేసినట్లు చెప్పారు. మండలానికి 750 బ్యాగుల దాణా వచ్చిందన్నారు. అవసరమైన రైతులు ఆధార్ కార్డుతో వారి వారి గ్రామాల్లోని పశు వైద్యశాలల్లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపిపి కరీం, రామచంద్ర, రామ్మూర్తి పాల్గొన్నారు.


యాచకులకు దుప్పట్లు పంపిణీ చేసిన లయన్స్ క్లబ్ సభ్యులు

యాచకులకు దుప్పట్లు వితరణ

ప్రజాశక్తి-నందలూరు

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన చారిత్రాత్మక నందలూరు శ్రీ సౌమ్యనాథ స్వామి ఆలయ ఆవరణలో శనివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో యాచకులకు దుప్పట్లు పంపిణీ చేశారు. స్పెషల్ పోలీస్ ఎస్ఐ మన్నెం రామమోహన్, జి.వి.సుబ్బరాజు వితరణతో యాచకులకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు లయన్స్ క్లబ్ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అనాధలకు, వృద్ధులకు శీతాకాలం సందర్భంగా దుప్పట్లు పంపిణీ చేయటం ద్వారా వారికి ఉపయోగ పడతాయన్నారు. అభాగ్యులను ఆదరించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో లయన్ కుర్రా మణి యాదవ్, ఉప్పు శెట్టి సుధీర్, మోడపోతుల రాము, గురు ప్రసాద్, గంధం గంగాధర్, గండికోట కృష్ణ, తీగలకుంట వెంకటేష్, గుండు సురేష్, కొర్లకుంట సుబ్బరామయ్య పాల్గొన్నారు.

అప్పుల్లో ఆల్‌టైమ్ రికార్డు : పిసిసి

ప్రజాశక్తి - కడప : 17 నెలల కాలంలోనే చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రూ. 2 లక్షల 27 వేల కోట్ల రూపాయల అప్పు చేసి ఆల్ టైం రికార్డు సృష్టించిందని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి పేర్కొన్నారు. శనివారం డిసిసి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం కంటే ప్రస్తుతం టిడిపి కూటమి ప్రభుత్వం అంతకుమించి అప్పు చేస్తోం దని పేర్కొన్నారు. మన కంటే ఇతర రాష్ట్రాలు తక్కువ మొత్తంలో అప్పులు చేశాయన్నారు. అమరావతిలో రాజధాని నిర్మాణం పేరుతో రాష్ట్ర ప్రజలపై చంద్రబాబు ప్రభుత్వం అప్పుల భారం మోపడం శోచనీయం అన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ ట్రబుల్ ఇంజన్ సర్కార్‌గా మారిపోవడం దురదృష్టకరం అన్నారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి మరో శ్రీలంక చేయవద్దని విజ్ఞప్తి చేశారు. విలేకరుల సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్ గౌడ్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, ప్రముఖ సంఘ సేవకుడు సలావుద్దీన్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బి.కొత్తకోట

వైసిపి కార్యకర్తలకు అండగా ఉంటామని ఎవరూ అధైర్యపడవద్దని ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని దేగానిపల్లిలో వైసిపి నాయకులు జల్లా సురేష్ నాయుడు నూతన గృహప్రవేశ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం స్థానిక వైసిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు పెట్టిన కార్యకర్తలు పార్టీకి అండగా ఉన్నారని అభినందించారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రతి కార్యకర్త ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను ప్రతి ఒక్కరూ వ్యతిరేకిస్తున్నారని, పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరం చేయడం సరికాదన్నారు. మెడికల్ కళాశాల ప్రయివేటీకరణను అడ్డుకునేందుకే కోటి సంతకాల కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి ఖలీల్ అహ్మద్, మాజీ జడ్‌పిటిసి ప్రదీప్‌రెడ్డి, పట్టణఅధ్యక్షుడు సి.ఆర్ చిన్నికృష్ణ, మాజీ సచివాలయ కన్వీనర్ కంచి కళ్యాణ్‌కుమార్‌రెడ్డి, గుమ్మడికాయల చాంద్ బాషా, వైసిపి నాయకులు బిసికాలనీబాబాజాన్, పాగొండ రఫీ పాల్గొన్నారు.


సురేష్‌నాయుడు కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

పెద్ద చెరువుకు జలకళ


జలకళతో నిండియున్న గాలివీడు పెద్దచెరువు

ప్రజాశక్తి-గాలివీడు

మండల పరిధిలోని గోరాన్ చెరువు పంచాయతీ కుమ్మరుపల్లి వద్ద ఉన్న గాలివీడు పెద్ద చెరువు జలకలతో నిండుకుంది. గాలివీడు పట్టణం నాలుగు రోడ్ల కూడలి గేటు ఆనుకుని పెద్ద చెరువు ఉండడంతో మదనపల్లి-గాలివీడు వెళ్లే వాహనాల రాకపోకల్లో చెరువును తిలకిస్తున్నారు. పెద్ద చెరువు కింద 150 ఎకరాలు వరిసాగు అవుతుందని రైతులు తెలిపారు. పది సంవత్సరాల తర్వాత గాలివీడు పెద్ద చెరువుకు నీళ్లు రావడంతో ఆ గ్రామ రైతు లు ప్రజలు హర్ష వ్యక్తం చేస్తున్నారు. పెద్దచెరువు నీటితో నిండినా కాలువ చూస్తే పరిస్థితి అధ్వానంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మొరవ పారుతుండటతో నీరంతా వృథాగాపోతోందన్నారు. నీరు వృధాగా రైతుల ఆశలు ఆవిరి అవుతాయన్నారు. ఇప్పటికైనా ఎడమ కాలువ, కుడి కాలువలకు ఇరిగేషన్ అధికారులు దృష్టిపెట్టి ఉపాధి హామీ పథకం ద్వారా అయినా మరమ్మతు చేస్తే నీరు వృథా కాకుండా ఉంటుందని తెలిపారు.

పేదలకు భరోసా సిఎం సహాయనిధి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కలికిరి

ముఖ్యమంత్రి సహాయనిధి పేద కుటుంబాలకు భరోసా భద్రతను ఇస్తుందని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. నగిరిపల్లిలో ఎమ్మెల్యే కార్యాలయంలో పలు రకాల ప్రమాదాల్లో గాయపడి చికిత్స పొంది, అనారోగ్యబారిన పడి ప్రయివేట్ ఆసుపత్రులలో చికిత్స పొందిన లబ్ధిదారులకు సిఎం సహాయనిధి చెక్కులను అందించారు. 56 మందికి గాను రూ.49.23లక్షల చెక్కులను బాధితులు అందుకున్నారు. ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరు టిడిపి కార్యకర్తల కుటుంబాలకు రూ.5లక్షలు చొప్పున ప్రమాద బీమా చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరు నియోజవర్గంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పేదలకు చేయూతనందిస్తూ కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి, ప్రమాదబీమా లాంటి పథకాలు ఆర్థిక భరోసానిస్తూ విశ్వాసాన్ని నింపుతాయని పేర్కొన్నారు. సిఎం చంద్రబాబు ఆదేశాలకు అనుగుణంగా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలపై పరిష్కరిస్తూ అభివృద్ధి సంక్షేమం అందించాలని లక్ష్యంతోనే పనిచేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నిజాముద్దీన్ ఉపాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి నాయకులు యోగేష్ రెడ్డి, ఎర్రంరెడ్డి, శ్రీనివాస్ వర్మ, అగస్తేశ్వర్, దినకర్ గౌడ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


బాధితులకు సిఎం సహాయనిధి చెక్కులు అందిస్తున్న కిషోర్‌కుమార్‌రెడ్డి

ఆ దారిలో వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిందే

- వ్యర్థాలతో కంపుకొడుతున్న పెద్దచెరువు మొరవ
- పారిశుధ్య చర్యలు చేపట్టాలని ప్రజల వేడుకోలు


వ్యర్థ పదార్థాలతో కంపు కొడుతున్న పెద్ద చెరువు మొరవ

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని గోరాన్‌చెరువు పంచాయతీ గేటు సమీపంలో ఉన్న గాలివీడు పెద్ద చెరువు చెత్తాచెదారం వ్యర్థాలతో మొరవ వద్ద కంపు కొడుతోంది. దుర్వాసనతో పరిసరాలు నిండిపోవడంతో ఆదారిలో వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిం దేనని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మదనపల్లి-గాలివీడు ప్రధాన రహదారి నాలుగు రోడ్ల కూడలి దాటిన తర్వాత పెద్ద చెరువు లోనికి నీరు రావడంతో మొరవ నీరు ప్రవేశించేందుకు సిద్ధంగా ఉంది. నాలుగురోడ్డు కూడలిలో నాలుగు చికెన్ సెంటర్లు, మూడు మటన్ సెంటర్లు, హోటళ్ల నుంచి తీసుక వచ్చే వ్యర్థ పదార్థాలు, కుళ్ళిన కూరగాయాలను అక్కడ వేయడంతో దుర్వాసన వెదజల్లుతోందని పేర్కొన్నారు. రోజుల తరబడి చెత్తా, చెదారం, మాంసం వ్యర్థాలు నిల్వ ఉండటంతో దుర్వాసన భరించ లేకపోతున్నామని పేర్కొన్నారు. ప్రతిరోజూ ఈ దారి గుండా విద్యార్థులు, ప్రజలు, వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారని ఆ దారిన వెళ్లాలంటే జంకుతున్నారని పేర్కొన్నారు. ఈ మధ్యకాలంలో కురిసిన వర్షాలకు దోమలు, ఈగలు స్వైర విహారం చేయడంతో రోగాల బారిన పడుతున్నామని చెబుతున్నారు. మలేరియా, డెంగీ, వైరల్ జ్వరాలు ప్రబలే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పారిశుధ్య పనులు చేపట్టాల్సి అవసరం ఉందన్నారు. ఈ ప్రాంతంలో వ్యర్థాలు వేయకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి వీలైనంత త్వరగా అక్కడి నుంచి వ్యర్థాలను తొలగించాలన్నారు. చెత్తవేయకుండా వ్యాపారులకు తగిన సూచనలు ఇవ్వాలన్నారు.పారిశుధ్య పనులు చేపట్టి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరుతున్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట : టిడిపి

ప్రజాశక్తి-మదనపల్లి అర్బన్

అభివృద్ధి సంక్షేమానికి టిడిపి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, కోళ్లబైలు పంచాయతీలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి పనులు జరిగాయని కోళ్లబైలు టిడిపి ఇన్ ఛార్జ్ రాటకొండ శ్రీనివాసులు నాయుడు పేర్కొన్నారు. శనివారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోళ్లబైలు పంచాయతీలో 14 వేలకు పైగా జనాభా ఉన్నారని, 5 వేల మంది వరకు ఓటర్లు ఉన్నారని, అయితే గత ఐదేళ్ల వైసిపి పాలనలో ఏ ఒక్క అభివృద్ధి పని జరగలేదన్నారు. ఒక్క రోడ్డు వేయలేదని కాలువ నిర్మించలేదని విమర్శించారు. టిడిపి కూటమి సర్కార్ అధికారం చేపట్టిన 16 నెలల్లో మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాష కోళ్లబైలు పంచాయతీ పై ప్రత్యేక దృష్టి సారించి రూ. 4.5 కోట్ల నిధులతో 39 రోడ్లను వేయించడం జరిగిందన్నారు. కోళ్లబైలులో 12 వీధులకు పైప్ లైన్లు ఏర్పాటు చేసి మంచినీటి సరఫరా చేసినట్లు తెలిపారు. ఐదేళ్ల వైసిపి పాలనలో ఒక్క అభివృద్ధి పని చేయకుండా తమ ప్రభుత్వంలోనే నిధులు కేటాయించామని వైసిపి సమన్వకర్త నిస్సార్‌అహ్మద్ చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గత ప్రభుత్వంలో రోడ్లు లేక అదే ప్రాంతంలో వరినాట్లు నాటిన సంగతి మరచిపోయారా అని ప్రశ్నించారు. డేటా సెంటర్‌ను తామే తెచ్చామని వైసిపి అధ్యక్షులు జగన్ చెప్పుకుంటున్నట్లు నిస్సార్ అహ్మద్ మతిభ్రమించి తామే నిధులు కేటాయించామని డప్పు కొట్టుకుంటున్నారన్నారు. గతంలో పంచాయతీ రాజ్ ఎఇగా పని చేసిన నువ్వు ఇలా అబద్దాలు ఆడటం తగదన్నారు. వైసిపి హయాంలో నేతలు భూ కబ్జాలకు పాల్పడ్డారని, ప్రభుత్వం వంద ఇళ్ల మంజూరు చేస్తే 200ఇంటి స్థలాలు ఆక్రమించుకుని అమ్ముకున్నారన్నారు. నిస్సార్ అహ్మద్‌కు చిత్తశుద్ధి ఉంటే వైసిపి చేసిన అభివృద్ధి ఏంటో చూపించాలని సవాల్ విసిరారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని స్థానిక సంస్థల ఎన్నికలలో వైసిపి అడ్రస్ గల్లంతయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బాలమాలి శేఖర్, రెడ్డిశేఖర్, జివి.నాయుడు, శ్రీనాథ్, రమేష్‌రెడ్డి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శ్రీనివాసులు నాయుడు

హోరాహోరీగా క్రికెట్ మ్యాచ్‌లు

- మొదటి ఇన్నింగ్స్‌లో కడప జట్టు 198 ఆలౌట్

ప్రజాశక్తి - కడప

అండర్ -14 డే మెన్ క్రికెట్ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగుతున్నాయి. శనివారం వై.ఎస్. రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో కడప, అనంతపురం జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచిన కడప జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. మొదటి ఇన్నింగ్స్‌లో 66.2 ఓవర్లలో 198 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని ప్రశాంత 41, తాహిర్ 39 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని రోహిత్ రెడ్డి 3, విక్రాంత్ 3 వికెట్లు తీసుకున్నారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు ఆట ముగిసే సమయానికి 28.0 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 54 పరుగులు చేసింది. కడప జట్టులోని ముని జ్ఞానేశ్వర్ 2 వికెట్లు తీసుకున్నాడు. **ఉత్కంఠగా చిత్తూరు, కర్నూల్ మ్యాచ్..** కెఒఆర్‌ఎం క్రికెట్ మైదానంలో చిత్తూరు, కర్నూలు జట్ల మధ్య మ్యాచ్ ఉత్కంఠగా సాగుతోంది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 28.3 ఓవర్లలో 63 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని లిఖిత్ ఇరగంరెడ్డి 36 పరుగులు చేశాడు. కర్నూలు జట్టులోని హేమంత్ నాలుగు, యశ్వంత్ సూర్య తేజ మూడు వికెట్లు తీసుకున్నారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్నూలు జట్టు 34.3 ఓవర్లలో 56 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని మోక్షజ్ఞరెడ్డి 26 పరుగులు చేశాడు. చిత్తూరు జట్టులోని రక్షణ సాయి అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి ఆరు వికెట్లు తీసుకున్నాడు. తరుణ్ కుమార్ మూడు వికెట్లు తీసుకున్నాడు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు ఆట ముగిసే సమయానికి 26.0 ఓవర్లలో రెండు వికెట్లు నష్టానికి 78 పరుగులు చేసింది.


తలపడుతున్న కడప, అనంతపురం జట్లు


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు తంబళ్లపల్లి విద్యార్థులు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీలకు మండల పరిధిలోని తంబళ్లపల్లి, కన్నెమడుగు విద్యార్థులు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పేర్కొన్నారు. అక్టోబర్ 30న కొత్తమంచూరులోని జడ్‌పి హైస్కూల్‌లో ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థాయి ఎంపికలు జరిగాయని చెప్పారు. జిల్లా ఎంపికలో కన్నెమడుగు విద్యార్థులు మానస, చేతన్ రెడ్డి, తంబళ్ళపల్లె విద్యార్థిని అనుష ఎంపికైనట్లు తెలిపారు. వీరు ఈ నెల9, 10వ తేదీలలో విజయవాడలోని కెబిసి, జడ్‌వి హెచ్‌ఎస్ పాఠశాలలో జరిగే రాష్ట్ర పోటీలలో పాల్గొంటారని స్కూల్ గేమ్స్ సెక్రటరీ తెలి పారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు ఉపాధ్యాయులు అభినందించారు.


దాతలను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అన్నదాన ట్రస్టుకు రూ.1.7 లక్షల విరాళం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

తంబళ్లపల్లె మల్లయ్యకొండ మల్లికార్జునస్వామి ఆలయ అన్నదాన ట్రస్ట్‌కు రూ.1.7లక్షలు విరాళంగా అందించారు. శనివారం గాలివీడుకు చెందిన ఉమామహేశ్వర్‌రెడ్డి భారతి, మల్రెడ్డి లీలావతి దంపతులు ట్రస్టు ఛైర్మన్ రాజశేఖర్రెడ్డి, వైస్ ఛైర్మన్ భాస్కర్‌రెడ్డికి చెక్కు అందించారు. ట్రస్ట్ సభ్యులు వారిని సన్మానించారు. ఏటా మహా శివరాత్రికి మల్లన్న దర్శనానికి వచ్చే భక్తులకు మూడు రోజులు అన్నదానం చేస్తారన్నారు.


కనకరాజు సూరికి స్వాగతం పలుకుతున్న యల్లటూరు

కనకరాజు సూరికి సత్కారం

ప్రజాశక్తి-రాజంపేట

మండల పరిధిలోని పులపుత్తూరు గ్రామంలో నిర్వహించే వన మహోత్సవానికి విచ్చేసి జనసేన పార్టీ పిఎసిసభ్యులు, రాష్ట్ర క్షత్రియ వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ కనకరాజుసూరికి రాజంపేట జనసేన పార్టీ పార్లమెంటు ఇన్చార్జి యల్లటూరు శ్రీనివాసరాజు, కార్పొరేషన్ డైరెక్టర్ అద్దేపల్లి ప్రతాప్ రాజు ఘనంగా స్వాగతం పలికారు. దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. క్షత్రియ సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా నిర్వహించే కార్తీక వనమమహోత్సవానికి కనకరాజు పాల్గొనడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో క్షత్రియ సంఘం నాయకులు, కూటమి నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

కూటమి పాలనలో నిరుద్యోగులకు మొండిచేయి

- మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి- రాయచోటి అర్బన్

కూటమి ప్రభుత్వ పరిపాలనలో మహిళలు, నిరుద్యోగులకు పాలకులు మొండి చేయి చూపారని మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ఎగువ అబ్బవరం, పాత రాయచోటిలోని 17 ,32, 33 వార్డులలో ఆయన వైసిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి కోటి సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు నిరుద్యోగ భృతిని ఇస్తామని, 18 సంవత్సరాల నుండిన ప్రతి మహిళకు నెలకు రూ. 1500 చొప్పున అందిస్తామని హామీ ఇచ్చిన కూటమి నాయకులు, తర్వాత పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. వైఎస్ ఆర్, వైఎస్.జగన్ పరిపాలనలోనే రాయచోటి నియోజకవర్గం అభివృద్ధి పథంలో పరుగులు తీసింది అన్నారు. కోట్లాది రూపాయలకు ఖర్చుపెట్టి ప్రాజెక్టులు నీటి పథకాలు, రహదారులు నిర్మించారన్నారు. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌లు నిర్మించారని పేర్కొన్నారు. పార్టీనాయకులు, అనుబంధ సంఘాల కమిటీలను త్వరితగతిన పూర్తిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలంటూ పిలుపునిచ్చారు. కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని ఎవరూ అధైర్య పడవద్దని భరోసానిచ్చారు. కూటమి ప్రభుత్వ వ్యతిరేక విధానాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ ఫయాజ్ బాషా మాజీ కౌంటర్ ఆనందరెడ్డి, కౌన్సిలర్ చంద్రశేఖర్, జిల్లా వాల్మీకి సంఘం అధ్యక్షులు గువ్వల బుచ్చిబాబు, బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి విజయభాస్కర్ , యూత్ సెల్ అధ్య క్షుడు కొత్తపల్లి ఇంతియాజ్, మాజీ టూరిజం డైరెక్టర్ కొత్తిమీర ప్రసాద్‌తో పాటు వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందడం కలకలం రేపుతోంది. ఈ సంఘటన శనివారం మండలంలో వెలుగుచూసింది. తాలూకా ఎస్ఐ చంద్రమోహన్ కథనం మేరకు.. మాలేపాడు పంచాయతీ, నడుమూరికి చెందిన గాలేటిసుధాకర్, సుగుణ(34)దంపతులు మదనపల్లెలోని నీరుగట్టు వారిపల్లెలో మగ్గాలు నేసుకుంటూ జీవనం చేసేవారు. రాత్రి స్వగ్రామంలో జరి గిన కోలాటకు ఇద్దరు వెళ్లారు. ఉదయం గ్రామ సమీపంలోని వ్యవసాయ బావిలో సుగుణ శవమై కనిపించింది. కుటుంబ సభ్యులు తాలూకా పోలీ సులకు ఫిర్యాదు చేశారు. అనుమానాస్పదమృతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆరుగురు పేకాట రాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండలంలో పేకాట స్థావరం పై దాడులు నిర్వహించి ఆరుగురు పేకాట రాయుళ్లను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. పోలీసుల వివరాల మేరకు... శనివారం కొండయ్యగారిపల్లి గ్రామం కొండయ్యగారిపల్లిలోని ఓ వ్యక్తి ఇంటిలో కొంత మంది వ్యక్తులు కలిసి పేక ముక్కలతో జూదం ఆడుతూ ఉండగా సమాచారం అందుకున్న ఎస్ఐ తిప్పేస్వామి తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారన్నారు. జూదం ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.2,620లు నగదును స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.